# గర్భమిత్రుడు

రా. భరద్వాజ

[మా పాఠకులు 'గర్భశత్రు' వనే మాటకి అర్థం ఎరుగుదురు. కాని బహుశా 'గర్భమిత్రు' డంటే ఎవరో ఎరక్కపోవచ్చును. శ్రీ భరద్వాజగారి కథ చదివితే ఆమాటకర్థం తెలుస్తుంది ]

ప్రపంచమంతా చుట్టాలకోసం పేనుక్కు చస్తాం గానీ—కేవలం అనవసరం అజ్ఞానమూనూ—చుట్టాల దేముంది? నాలుగు పిచ్చిక లున్నప్పుడు ఇంటినిండా మూగుతారు. అవి లేనప్పుడు ముఖం తప్పిస్తారు. కాని స్నేహితుడి విషయం అట్లా గాదు; జేబు బరువుగా వున్నపుడు ఎంత సన్నిహితంగావుంటాడో? కాస్త లేమిడిపడ్డప్పుడుగూడా అంతే సన్నిహితంగా వుంటాడు. డబ్బు వున్నపుడు దగ్గిరకు చేరి, అది లేనప్పుడు—కేవలం మన మెవరుగూడా తెలియనట్లు నటించే వాళ్లూ వున్నారు: అయితే ఇటువంటివాళ్ళను స్నేహితులనటానికి బొత్తిగా వీల్లేదు. వీళ్ళొక తరహాకు చెందిన తైరుగాళ్ళు! నిజమైన స్నేహితుడు హిందూపతివ్రత లాంటివాడు; తనకు అవసర మొచ్చినపుడు మనను వుపయోగించుకుని, మనకవసర మొచ్చినపుడే తాను వుపయోగ పడతాడు ఈ సందర్భంలో, కలిమి లేములకు. ఉచ్చనీచాలకు తావరం వుండదు

ఈ విషయాన్ని నేను రామదాసుమూలంగా రుజువు చేసుకొన్నాను. ఒకప్పుడు నేనూ వాడూ మహా స్నేహితులం. మాయిద్దరి పరిచయానికీ ప్రారంభమెప్పుడో మాకే తెలియదు; కాని. ఆ ప్రథమక్షణం మాత్రం, అపురూప మైనది. ఒకే బళ్ళో వొకే క్లాసులో చదివాము- పక్కపక్కనే నుకొని కూచునేవాళ్ళం- నేను. కందిపప్పూ చింతపండూ. ఎఱ్ఱ బియ్యమూ. వాడికి పెడుతుండే వాణ్ని- వాడు పప్పుచెక్కా, తిమ్మిరిబిళ్ళలూ, నిమ్మతొనలూ తెచ్చుకొని నాకు పెడుతుండే వాడు- ఒకసారి నేను లెక్క కాపీ కొట్టనిచ్చ నందుకు గాను. పంతులు నన్ను కోదండంతీశాడు- పాపం! రామదాసు నావేపుచూసి ఎట్లా ఏడిచా డనీ. అప్పుడే వాడి సహృదయత్వం నాకర్థమయింది; తరవాత నా విషయాన్ని గురించి తన తండ్రితో చెప్పాడు రామదాసు తండ్రిఅంటే వూరు మొత్తం హడల్. మరి మునసబుగారంటే హడలుగాదా యేమిటి? .ఆయనగారు పంతుల్ని 'తంతా'నన్నా డట—'ఇట్లాఅయితే నీవుద్యోగం పీకి పారేయిస్తా' నన్నాడట—'నీ కొంప తగల పెడతా' నన్నాడట. సాయంత్రం తోపులో బిళ్ళంగోడు ఆడటాని కొచ్చినప్పుడు దాసుగాడే యిదంతా చెప్పాడు నాకు ....

అవునామరి . అటువంటి స్నేహితం మాది- ఒక కంచానతిని, వొకమంచాన పండుకోలేదన్న మాటేగానీ, అట్లా చేసినవాళ్లు గూడా మా అంత అనుబంధకంగా వుండనే వుండరు— అయితే కాలం విషమించింది. మే మిద్దరమూ విడిపోవలసి వచ్చింది- మావూళ్లో అరవతరగతి కంటే మించిలేదు- మునసబుగారికి కొడుకుని

బి. ఎ. దాకా చదివించాలని వుంది- అందుకని బస్తీకి పొమ్మన్నాడు కొడుకుని- రామదాసు మొదట్లో పోనని మొరాయించినా చివరికి తప్పలేదు—

అదే మా విడబాటుకు ప్రారంభం- ఆతరవాత మేము చాలా అరుదుగా కలుసుకొంటుండే వాళ్ళం_ కొంతకాలానికి నేనుకూడా ఆవూరు విడిచిపెట్టవలసివచ్చింది. పొట్టజరగక మా నాన్నగారు ఆవూరు విడిచిపెట్టారు. కొంతకాలం వరకూ వాళ్ళవాళ్ళ ద్వారా రామదాసు భోగట్టా కనుక్కుంటుండే వాణ్ని_ వాడు బి ఎ చదివాట్ట ఏదో గవర్నమెంటు ఉద్యోగంకూడా దొరికిందట-

ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే 'స్నేహితం' అనేదాంట్లో ఎంతటి ఆత్మీయత వుందో చూపించటానికి. నేనుచాలా పేదవాణ్ని, చదువుకూడా అబ్బే లేదుమరి- వేళ మించకుండా నాలుగువేళ్లూ ముడవటయే గగన కుసుమంగా వుంది. అటువంటి వాడింటికి రామదాసు అతాత్తుగా వొచ్చాడు.

అసలు వీడు రామదాసని నేను కనుక్కోలేక పోయినాను_ మనిషి బాగా ఎదిగాడు; పచ్చగా దోసకాయమల్లే పండబారాడు! ఉల్లిపొరలాంటి పంచెలు కట్టాడు; కళ్ళకు బంగారు జోడు పెట్టాడు; నిగనిగామెరిసే బూట్లు టకటకా లాడించుకొంటూ వొచ్చాడు వాణ్నిచూసి నేను బిత్తరపోయి నిలబడి వుంటే, వాడే నన్ను భుజం మీదకొట్టి పలకరించాడు.

"నిన్ను గుర్తించలేక పొయ్యానురా" అన్నా వాణ్ని ఆపేక్షగాచూస్తూ. ఇద్దరం కౌగిలించు కొన్నాము.

వాణ్నిచూస్తే నాకు సిగ్గువేసింది. ఎందుకో భయంగూడా కలిగింది. బాగా చదివాడు. గొప్ప ఉద్యోగం చేస్తున్నాడు. అన్నిటికంటే ముఖ్యం ధనవంతుడు_ ఎంత స్నేహితుడయితేమట్టుకు— ఇంత దరిద్రంలోవున్న వాడింటికిరావటమనేది... మరి మాటలా?

రామదాసుమాట్లాడుతున్న ధోరణిచూస్తుంటే నా భ్రమయావత్తు కలకమల్లే విచ్చిపోయింది- వాడిలో మునుపటి ఆత్మీయత కించిత్తయినా తరగలేదు- నేను తనతోమాట్లాడానికి జంకుతున్నట్టుగా వాడుగ్రహించి నొచ్చుకున్నాడు_

"నేను లోకులందరికీ వుద్యోగస్తుణ్నయి నంత మాత్రాన నీకు అవుతానట్రా? మనిద్దరం ఎప్పటి లొల్లిగాళ్ళమే!" అన్నాడు రామదాసు-

ఇద్దరంచిన్నప్పటిసంగతులుమాట్లాడుకొంటూ చాలాకాలం కులాసాగాగడిపాము .రామదాసు ఏదో తనిఖీచెయ్యటానికి ఈవూరు వొచ్చాడట_

"అయితేమరి మకాం ఎక్కడ వేశావు?" అన్నాను-రాముదాసు నన్నెంత ప్రోత్సహిస్తున్నా వాణ్ని 'అరేయ్'అని పైకి అనలేక పోతున్నాను.

"మీయింట్లో వీలుగాదని నువ్వుచెబితే ఇంకెక్కడన్నా చూసుకొంటాను" అన్నాడు రామదాసు. ఈమాట అంటున్నపుడు వాడి కంఠం లోని మార్పును నేను గమనించక పోలేదు-

"అందుగ్గాదు- ఇక్కడ సరిగ్గా నీకు మర్యాద జరగదేమోనని. .ఎందుకంటే నీబోటి ఆఫీసరు నావంటి సామాన్యుడి ఇంటో. ."

"అరిచావంటే చంపేస్తా న్రోయ్ భడవాయ్ డొంక తిరుగుడుగా యాడవట మెందుకు? ఇష్టం లేదని ఖచ్చితంగా మొఖానఅనరాదు?"అన్నాడు రామదాసు కొంచం కోపంగా_

వాడిమనస్సును నొప్పించి నందుకు విచార పడ్డాను- రామదాసు ఆనాలుగు రోజులూ మాయింట్లోనే వుండటానికి ఏర్పాటు జరిగింది- మొదట నేనుకొంచం భయపడ్డమాట నిజమేకానీ, అదంతా అనవసర మనిపించింది- తను అధికారినని, చదువుకొన్న వాణ్ననీ, డబ్బుగలవాణ్ననీ మాకు ప్రతిక్షణమూ తెలిసివొచ్చేట్టు వాడు ప్రవర్తించలేదు_ చాలా సన్నిహితంగా అతికి పొయ్యాడు రామదాసు_

నేను పనిలోకెళ్ళాలి! రెక్కాడితేగాని పొయిలోపిల్లి లేవదు- పనికిపోని రోజున ఏకాదశి తిథికింద దాదాపుగా లెఖ్ఖవేసుకో వచ్చు. దాసుగాడికేం మహారాజు, వాడితో కబురు

చెబుతూ కూచుంటే మరి నాకు బువ్వెట్లా దొరుకుతుంది- అంచేత వాడి అవసరాలన్నీ కనిపెట్టి చూస్తుండమని మా ఆవిడతో చెప్పాను- కావలసిన వాటిని సిగ్గుపడకుండా అడగమని దాసుగాడితోటీ చెప్పాను, ఏం జీవితం—దిక్కుమాలిన జీవితం చిన్నప్పటి ప్రాణస్నేహితుడొచ్చాడంటే వాడితో పట్టుమని పదిరోజులు తిరగటానికి లేదు! ఏమిటో దరిద్రపు జన్మలు—

మూడవరోజున నేను పనినుండి రాగానే రామదాసు నన్ను బజారుకు ప్రయాణం కమ్మన్నాడు

"ఎందుకురా?" అన్నాను వాడితో: వాడికొక దురభ్యాసముంది; ఒక్కడితో అయ్యేపనికి పాతికమందిని పోగుచేస్తాడు; పొద్దు గూకులూ, విరుచుకొని వెంటనే బజారుకు వెళ్ళటానికి ప్రాణం 'సొలి' వొస్తుంది నాకు-

"ఎందుకేమిట్రా ఓబొంద- ఏం బతుకురాయిది? కట్టుకోవటానికి కాస్త అనువయిన గుడ్డగూడా లేదాయె. అతుకులు బెట్టబొచ్చా, మాసిక లెయ్యని గుడ్డా కలికానికి గూడా దొరకదు ఈకొంపలో ఎట్లాబతుకుతున్నావురా ఈ బతుకు" అన్నాడు రామదాసు।

రామదాసు ముఖం చూస్తుంటే నాకు నవ్వొచ్చింది.

"నేను భాగ్యవంతుణ్ని కాదు. కనీసం పెద్ద స్కేలు వుద్యోగస్థుణ్ని కాదు. నలభైరూపాయల గుమాస్తాని. ఆ డబ్బుతో ఉల్లిపార గుడ్డలే కానేదా? నా పొట్టా, నా పెళ్ళాంపొట్టా నిండనా? ఏది ముఖ్యం?" అన్నాను.

రామదాసు పావుగంటసేపు నా దరిద్రావస్థకు విచారం ప్రకటించాడు. "అయితే సరే లేరా. రోజు ఎప్పుడూ ఒకరకంగా వుండదు తూర్పున పొడిచిన సూర్యుడు అక్కడే వుండడు. పడమట కొస్తాడు.. బజారుకెడదాంరా మరి" అన్నాడు రామదాసు

"ఎందుకోయ్ యిప్పుడు బజారుకు?" అన్నాను మళ్ళీ.

"గుడ్డలు తెచ్చుకొందువుగాని" అన్నాడు రామదాసు.

"ఇవ్వాళ పందొమ్మిదో తారీకు ఒకటో తారీకునాడుగానీ ఆపిప్పళ్ళబస్తా జీతంయివ్వడు"

"నాదగ్గరవుంది. నేనిస్తాను"

"సరేలే ... ఏడిచినట్టేవుంది. ఇక నీదగ్గర డబ్బుపెట్టి..."

"ఏం? నాడబ్బు నువ్వు తినగూడదా? అంత విషమైపోయిందా?" అన్నాడు రామదాసు గంభీరంగా.

"వారు ఆవిధంగా బతిమిలాడుతుంటే, ఏమిటండీ ఈ సాగదీయించుకోవటం— ఏం వెళ్లి రారాదూ?" అన్నది మా ఆవిడ.

"పదరా బడుద్ధాయ్- ఆడకూతురు కున్నంత యింగితం లేకపోయె నీ జన్మ తగలెయ్య .." అన్నాడు రామదాసు, మా ఆవిడకు వత్తాసు పలుకుతూ-

ఇద్దరం బజారుకొచ్చాం. రామదాసు బోలెడు ఖరీదు చేశాడు. నాకు రెండుపంచలు, రెండు చొక్కాలు తీశాడు. మా ఆవిడకు రెండు కలనేత చీరలూ, రెండు వంకాయరంగు చీరలూ కొన్నాడు.

"ఇది డెబ్భయ్ రూపాయలు చెబుతున్నాడు. అంచు, నేతా బాగున్నదేమో చూడు" అన్నాడు రామదాసు ఒక జరీఅంచు గులాబీరంగుచీర నాకు చూపించుతూ

"ఇదెందుకురా? ఇంతడబ్బు వొక్కచీరకు తగలెయ్యడమేమిటి? నీకేమన్నా పిచ్చిపట్టిందా ఏమిటి?" అన్నాను రామదాసుతో. వాడు ఖర్చు పెడుతున్న పద్ధతులు చూస్తే నాకళ్ళు భయర్లు కమ్ముతున్నయ్.

"ఆఁ! పండగలకీ, పబ్బాలకీ కట్టుకుందుకు వుంటుంది; ఏం బావుండలా? అంచుమాత్రం మహా పసందుగా వుందిరా? కదూ?"

..మొత్తం నూట ముప్ఫయ్ఐదు రూపాయలు గుడ్డలతో యింటికొచ్చాము; మా ఆవిడముఖం విప్పారింది అటువంటి సంతోషం దాని ముఖం

మీద ఆరేళ్ళకోలిసారి నేను చూడటం నాకు మాత్రం రామదాసుచేత నాకోసం అంతఖర్చు పెట్టించడం అనుచితంగానే వుంది.

రామదాసు 'నాలుగుసార్లు తిరగవాళ్ళకూడా వెళ్ళలేదు.' వెళ్ళకుండుకు నేను విచారించటం కూడా లేదు. కూరగాయలు, బియ్యమూ వాడే తెప్పిస్తున్నాడు 'ఇదేమిట్రా?' అంటే మనలో మనకు ఎల్లాఅయితే ఏరా?' అంటాడు. నేను దరిద్రుణ్ణే అని గానీ, నీకొంపఅధివన్నంగా వుంటుందని గానీ, వాడు ఏక్షణానా అనుకొన్నట్టు కనిపించడు.

"మనస్సు కలిసిపోవాలి గానీ, పంపులూ మేడలూ అక్కర్లేదు. చాప, పూరిల్లూ చాల మిత్రా!" అంటాడు రామదాసు. రామదాసు నిగర్వి బహుయోగ్యుడు. సహృదయుడు కాక పోతే ఏదో చిన్నతనంలోని స్నేహాన్ని పట్టుకొని తనింతహోదాలో వుండికూడా, నాకు అతిథిగా వుండట మేమిటి? అందుకే చుట్టాలకంటే స్నేహితులు. అందులో రామదాసులాంటివాళ్ళు నిజమైన బంధువు లంటాను. ఆపదలో వున్నప్పుడు ఏ బంధువూ చెయ్యని, చెయ్యలేని సహాయం స్నేహితుడు చేస్తుంటాడు. అందుకే చెడి చెల్లెలింటికిపోకుండా, స్నేహితుడి పంచకు చేరమంటారు మనవాళ్ళు.

పదిహేను రోజులదాకా రామదాసు మా యింట్లోనే వున్నాడు. ఈ పదిహేనురోజుల్లోనూ అయిన ఖర్చంతా దాదాపు రామదాసే వాడే శాడు. వాడు పోతున్నాడంటే నాకు ప్రాణం ఏమిటోగా వుంది. కానీ తప్పే దేముంది.

"వెళ్ళొస్తాను" అన్నాడు రామదాసు. నేను మాట్లాడలేక నిలబడిపోయినాను. మా ఆవిడ కన్నీళ్ళతో గడపల్లో నిలుచునివుంది. పుట్టింటి నుండి, వొచ్చేనాడైనా మాఆవిడ ఏడిచినట్టుగా నాకు జ్ఞాపిలేదు.

"మళ్ళీ వీలు చూసుకొని సాధ్యమయినంత త్వరలో రండి" అన్నది మా ఆవిడ డగ్గుత్తికతో.

రామదాసు బండిని మలుపు తిరిగిందాకా పంపించి యింటికొచ్చాను. మా ఆవిడ మంచంమీద బోర్లపండుకొని విచారిస్తూవుంది. నా అలికిడి విని కన్నీరు తుడుచుకొంటూ ఇంట్లోకెళ్ళింది. ఆరోజూ, ఆ మరుసటిరోజూకూడా మా ఆవిడ విచారిస్తూనేవుంది.

ఒకనాడు అన్నం వడ్డిస్తున్నప్పుడు మా ఆవిడ మెళ్ళో బంగారపుగొలుసు చూశాను.

"ఎక్కడిదే!" అన్నాను మా ఆవిణ్ణి.

"ఏమిటి?"

"ఇదే గొలుసు..."

మా ఆవిడ క్షణకాలం చలించి" ఇదీ . .ఆ! మాఅమ్మగారు చేయించారు .. నిన్న వాళ్ళ వెంకయ్యన్నయ్య వొస్తుంటేనూ అతనితో పంపించారు .ఈయేడు పల్లపుపొలం కంది బాగా ఈనిందట్లే . మూడొందలు బెట్టి చేయించారు... అన్నది మా ఆవిడ.

ఆ సంవత్సరం మాఅత్తగారి పొలం బాగా పండిందేమో, కూతురుకు బంగారపు గాజులు, చిన్న జడబిళ్ళాకూడా మనుషుల కిచ్చిపంపించారు మాఅత్తవారూ మేమూ మాట్లాడుకోము. అల్లుణ్ణిగనక నేను పగవాణ్ని కానీ, కూతురు వాళ్ళమనిషే గా! నాయింటికి రావటానికి మొఖం చెల్లకపోయింది గావును. కూతురు కాపరాని కొచ్చి మూడు సంవత్సరాలయినా ఒక్కసారి కూడా మాయింటికి రాకుండా, పొరుగింటికొచ్చి కూతుర్నిచూసి వెళ్ళిన మా అత్తవారు ఈవిధంగా గాజులు, గొలుసులు ఎందుకు మనుషులకిచ్చి పంపిస్తున్నారో నాకు తెలియకపోలేదు. ఇంతకాలమూ మా ఆవిడ వొట్టిమనిషి. ఇప్పుడు. . ఏదో భగవంతుడి దయవల్ల మా ఆవిడ గర్భంతో వున్నది... ఆమాత్రం తెలుసుకోలేని మూర్ఖుణ్ని కాదుగా నేను